



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 పేజీలు 8


# 7న పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష కేంద్రాలు సిద్ధం**

- **పరీక్షకు హాజరుకానున్న 6593 మంది అభ్యర్థులు**
- **పరీక్ష నిర్వహణకు 17 కేంద్రాలు...**
- **డిఆర్ఓ ఎం. లక్ష్మీ నరసింహం**



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహం అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డిఆర్ఓ ఎం. లక్ష్మీ నరసింహం, లైజన్ ఆఫీసర్లు, ఛీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 7వ తేది ఆదివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష ఆఫ్ లైన్ ఓఎంఆర్ ఆధారితంగా జరగనున్నాయన్నారు. ఈ పరీక్షకు నగరంలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షలకు 6,593 అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. 17 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 17 మంది లైజన్ ఆఫీసర్లను నియమించామన్నారు. మిగతా 2లో





# ఎరువులకు కొరత లేదు

**కృత్రిమ కొరత సృష్టికి అధికారులదే బాధ్యత**

**దుకాణాల వద్ద ఎరువుల అమ్మకాలను నిరంతరం పర్యవేక్షించాలి**

**సిబ్బంది స్వయంగా దుకాణాల వద్ద రైతులకు అందుబాటులో ఉండాలి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ** 2

# గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి : జేసీ

వివరాలు 2లో





# నిమ్మకూరులో బాలయ్య సందడి..

- తన సంతోషాన్ని గ్రామస్తులతో పాలుపంచుకునేందుకు వచ్చానన్న బాలయ్య

**పామర్రు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులో పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. సినీ ప్రస్థానం 50 ఏళ్లు పూర్తిచేసుకుని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్న అనంతరం తొలిసారిగా బాలకృష్ణ స్వగ్రామానికి వచ్చారు. ముందుగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిమ్మకూరు గ్రామానికి చెందిన ఆడపడుచులు బాలయ్యకు మంగళహారతి ఇచ్చి స్వాగతం పలికారు. అలాగే స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు గార్డ్ ఆఫ్ హానర్‌తో స్వాగతం పలుకగా వారిని ఆప్యాయంగా పలకరిస్తూ బాలయ్య ముందుకు సాగారు. మిగతా 2లో...





# యూరియా కొరత లేదు

**రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు**

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**గుడివాడ మేజర్ న్యూస్ :** జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు చెప్పారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ గుడివాడ పట్టణం, మండలంలోని లింగవరం, 2

(మొదటిపేజీ తరువాయి)

## 7న పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

7వ తేదీ ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 5:30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్ష నిర్వహణలో ఛీఫ్ సూపరింటెండెంట్ల పాత్ర కీలకమని ఈనెల 6వ తేదిన ఇన్విజలేటర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో సంబంధిత తహాశీల్దార్లు, 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుండి సా. 6 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా ఏపిసిపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవరస మందులతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రా లలోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లను అనుమతిం చకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష వ్రాసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసి పరీక్షా కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని డిఆర్‌ఓ లక్ష్మీనరసింహం అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ సిహెచ్ సాయి ప్రకాష్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరిండెంట్ ఎస్.సలీం, సంబంధిత అధికారులు ఉన్నారు.

## గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులతో జిల్లాలోని గృహ నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో తరచుగా సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసే విధంగా వారిని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాల పురోగతిపై గత సమావేశంలో అధికారులకు లక్ష్యాలు నిర్దేశించినప్పటికీ కొన్ని మండలాల్లో అనుకున్న స్థాయిలో పురోగతి లేదని, ఉయ్యూరు, తోట్లవల్లూరు వంటి మండలాల్లో పురోగతి శూన్యంగా ఉందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిస్తూ, వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను ముందుకు తీసుకువెళ్లి పూర్తి చేయాలన్నారు.గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం నుంచి అదనపు ఆర్థిక సహాయం పొందుతున్న వెనుకబడిన వర్గాల లబ్ధిదారులు గృహాలను త్వరితగతిన నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలని చెబుతూ అధికారులు లేఅవుట్లను క్షేత్రస్థాయిలో సందర్శించి అవసరమైన వాటికి మెరక పనులు, అప్రోచ్ రోడ్లు నిర్మించాలని సూచించారు. ఈ సమావేశంలో విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఇంచార్జ్ జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి పోతురాజు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జెడ్పి డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, డీఎస్ఓ జి మోహన్ రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి శివరాం ప్రసాద్, మత్స్య శాఖ అధికారి నాగరాజా, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, పర్యాటక శాఖ అధికారి రామలక్ష్మణరావు, బీసీ వెల్ఫేర్ అధికారి జి రమేష్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ సంస్థ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మకూరులో బాలయ్య సందడి..







(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలోని స్వర్గీయ ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు ఎమ్మెల్యే కుమార్ రాజాతో కలిసి పూలమాలలు వేసి బాలకృష్ణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పద్మభూషణ్, దేశంలో మొదటి కళాకారుడుగా బుక్ ఆఫర్ రికార్డ్స్ లో స్థానం పొందడం తన జీవితంలో మర్చిపోలేనివన్నారు. వరుస సినీ విజయాలను ప్రజల విజయాలుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవులు నాకు ముఖ్యం కాదు, వాటికే నేను అలంకారమన్నది నా భావన అని పేర్కొన్నారు. ఈ విజయాలన్నీ తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. తండ్రైన.. గురువైన... దేవుడైన నాకు అన్ని ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. పాత్రలకు ప్రాణం పోస్తూ నటించిన ఎన్టీఆర్ దరిదాపులకు చేరాలన్నదే నా తపన, ఆశయం అంటూ ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ ఉన్నత స్థితికి రావడానికి తన తల్లి బసవతారకం చేసిన త్యాగాలు, అందించిన సహకారం ఎనలేనివని పేర్కొన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా రాయలసీమను నా అడ్డాగా భావిస్తానని, దృఢ సంకల్పం ఉంటే భగీరథులు కావచ్చని రాయలసీమకు నీరు అందించి చంద్రబాబు నిరూపించారన్నారు. హిందూపురంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించడం సంతోషంగా ఉంది. గతంలో ఎన్టీఆర్ మూడుసార్లు, ప్రస్తుతం తాను మూడవసారి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నేడు భౌగోళికంగా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. అక్కడ కియా వంటి సంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెండుగా పెరిగాయని పేర్కొన్నారు. సందేశం ఉండాలన్న లక్ష్యంతో ప్రతి సినిమా చేస్తున్నానని, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో అంతర్జాతీయ వైద్య సేవలు అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. తన సంతోషాన్ని గ్రామస్తులతో పంచుకోవాలని నిమ్మకూరు వచ్చానని, గతంలో తన తండ్రి ఎన్టీఆర్ కూడా ఏ పని మొదలుపెట్టాలన్నా ముందుగా స్వగ్రామం నిమ్మకూరు వచ్చి ప్రారంభించే వారని అలాగే ఆనవాయితీగా తాను కూడా ప్రతి కార్యక్రమం చేపట్టిన సమయంలో నిమ్మకూరు వచ్చి తన ఆత్మ బంధువులతోనూ, కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించటం చేస్తున్నానని తెలిపారు. ఎక్కడ ఉన్నా తెలుగు వారంతా ఒకటే అన్నది ఎన్టీఆర్ భావన, తన ఆలోచన కూడా అని పేర్కొన్నారు. వరదల వల్ల తెలంగాణలో చాలామంది నష్టపోయారని, అన్నదాతలు విలవిలలాడుతున్నారని, తెలుగు వారికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా పరస్పరం సహకరించుకుంటూ అండగా ఉండాలని అన్నారు. తన అపజయాల్లో ప్రాంతాలకతీతంగా తోడుగా ఉన్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన యువత జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తుండగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సోషల్ మీడియా వల్ల ప్రపంచం కుదించుకుపోయిందని పేర్కొంటూ సోషల్ మీడియాను మంచికి వాడాలని వినాశనానికి వాడవద్దని వారికి విజ్ఞప్తి చేశారు. మంచి ఉద్దేశంతో అఖండ – 2 సినిమాను తీశామని, కులాలకు, మతాలకు ఆపాదించకుండా హైందవ ధర్మానికి ప్రతిరూపంగా తెరకెక్కించిన ఈ సినిమాను ప్రతి ఒక్కరు అదే కోణంతో చూడాలని సూచించారు. అనంతరం బాలకృష్ణ గ్రామంలోని బంధుమిత్రులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, సూరపనేని వెంకట సత్యనారాయణ, వీరపనేని శివరామ ప్రసాద్, చలసాని రమేష్ చౌదరి, పామర్రు మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు బాలకృష్ణ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎరువులకు కొరత లేదు..



**ఎన్‌టీఆర్ జిల్లా/ఎ.కొండూరు, సెప్టెంబర్ 04, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన ఎరువులను సరఫరా చేయడం జరిగిందని.. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎక్కడైనా కృత్రిమ కొరత ఉందనే సంఘటనలు ఎదురైతే అందుకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని.. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద స్వయంగా అన్నదాతలకు సహాయకారిగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలో ఎరువుల సరఫరా స్థితిగతులపై గురువారం ఉదయం వ్యవసాయం, ఉద్యాన, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీల్లో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ.. ఎ.కొండూరు మండలం, కంభంపాడు గ్రామంలో గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎరువుల దుకాణాలు, సరఫరా కేంద్రాల వద్ద నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు.. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో పటిష్ట సమన్వయంతో పనిచేస్తూ లోటుపాట్లకు తావులేకుండా చూడాలని, అంతిమంగా ఏ రైతూ ఎక్కడా ఇబ్బంది పడకూడదని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**యూరియా, నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించండి:**

విచ్చలవిడిగా ఎరువుల వినియోగం వల్ల పంటతో పాటు నేల ఆరోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని.. పంటకు ఏ దశలో ఎంత మోతాదు యూరియా వేయాలనే దానిపై అన్నదాతలకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహా ప్రకారం... వరి నాటు వేసినప్పుడు ఒకటో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చన్నారు. నాటు వేసిన 30 రోజులకు రెండో విడతగా ఎకరానికి 30 కిలోలు, నాటు వేసిన 60 రోజులకు మూడో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చన్నారు. రెండు, మూడో విడతల్లో అధిక దిగుబడులకు, పర్యావరణ పరిరక్షణకు, నేల సారాన్ని కాపాడుకునేందుకు యూరియాకు బదులు నానో యూరియాను స్ప్రే చేసుకోవచ్చని.. ఇందుకు అవసరమైన డ్రోన్లను సమకూర్చేందుకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# యూరియా కొరత లేదు

(మొదటిపేజీ తరువాయి)

వలివర్తిపాడు, రామన్నపూడి గ్రామాలలో మన గ్రోమోర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసి యూరియా సరఫరా, పంపిణీ స్థితిగతులను విచారించారు. తొలుత గుడివాడ పట్టణంలోని నెహ్రూ చౌక్ వద్ద గల మన గ్రోమోర్ కోరమండల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ డీలర్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అందులో ఉన్న స్టాకు వివరాలు, పంపిణీ వివరాలను మేనేజర్ కోటయ్యను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అక్కడే ఉన్న రైతులతో కాసేపు యూరియా పంపిణీ వివరాలు ముఖాముఖి మాట్లాడారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో కాసేపు ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులతో సమావేశమై యూరియా సరఫరా, పంపిణీ అంశాలపై సమీక్షించారు. తదనంతరం జిల్లా కలెక్టర్ గుడివాడ మండలంలోని లింగవరం లోని రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ ఉన్న గ్రామ రైతుల మల్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, గోపాలస్వామితో యూరియా స్థితిగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు రెండు డోసుల యూరియా సరఫరా అయిందని, ఇంకొక డోస్ యూరియా అవసరం ఉందని రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కావలసినంత యూరియా పంపిణీ చేస్తామని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.తదుపరి గుడివాడ మండలంలోని వలివర్తిపాడు గ్రామంలోని శ్రీరామ సొసైటీ, రైతు సేవ కేంద్రం లను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడి రైతుల సొసైటీ అధ్యక్షులు పంచకర్ల బ్రహ్మయ్య పాలెంచు వెంకటేశ్వరరావులతో మాట్లాడుతూ గత సంవత్సరం 27 వేల ట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని,అదే విధంగా ఈ సంవత్సరం కూడా 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. అయినప్పటికీ రైతుల్లో ఆందోళన ఎందుకు ఉందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదివరకు బయట షాపుల్లో ఏరియా బాగా దొరికేదని సొసైటీలకు ఇవ్వడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు అంతే కాకుండా ఒక బస్తా యూరియా కలుపు మొక్కలు నివారణ కోసం వాడుతున్నామన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కావలసినంత యూరియా ఇతర జిల్లాల నుండి కూడా తెప్పిస్తున్నామన్నారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెప్పారు.తదుపరి జిల్లా కలెక్టర్ గుడివాడ మండలంలోని రామన్నపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆకస్మిక తనిఖీ చేసి అక్కడి



రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఎకరాకు ఎంత యూరియా కావాలని రైతులను అడగగా వారు కలుపు మొక్కలకు ఒక బస్తా తో కలుపుకొని ఎకరాకు మూడు కట్టల యూరియా అవసరం ఉందని కలెక్టర్కు తెలియజేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, గుడివాడ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడి కవిత, తహసిల్దారు కిరణ్, మండల వ్యవసాయ అధికారి అనంతలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక, శ్రావణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఈయుజిఎంపి సర్టిఫికేషనన్ను పొందిన అపర్ణ ఫార్మాస్యూటికల్స్



**విజయవాడ మేజర్ న్యూస్ :** యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ (ఏపీఐ లు), అడ్వాన్స్డ్ డ్రగ్ ఇంటర్మీడియట్స్ కు సంబంధించి ప్రముఖ తయారీ సంస్థ అయిన అపర్ణ ఫార్మాస్యూటికల్స్, నేడు తమ వృద్ధి ప్రయాణంలో రెండు ముఖ్యమైన మైలురాళ్లను చేరుకున్నట్లు వెల్లడించింది. వీటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్లోని శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో ఉన్న కంపెనీ తయారీ కేంద్రం, అపర్ణ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, యూరోపియన్ యూనియన్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ (ఈయుజిఎంపి) సైట్ ఆమోదాన్ని పొందడం కాగా, మరొకటి భారతదేశంలో మొట్టమొదటి వ్యవస్థీకృత లైఫ్ సైన్సెస్ క్లస్టర్ అయిన హైదరాబాద్లోని జీనోమ్ వ్యాలీలో 7,300 చదరపు అడుగుల విస్తీర్ణంలో తమ అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రమైన అపర్ణ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ను ప్రారంభించడం. ఈ పురోగతులు ఔషధ తయారీ, పరిశోధనలో నాణ్యత, ప్రమాణాలను అనుసరించటం, ఆవిష్కరణల పట్ల అపర్ణ నిబద్ధతను నొక్కి చెబుతున్నాయి. ఈయుజిఎంపి క్లియరెన్స్ పొందడంతో పాటు, క్లోపిడోగ్రెల్ హైడ్రోజన్ సల్ఫేట్ కోసం దాని మొదటి కూడా అపర్ణ సర్టిఫికేట్ ఆఫ్ సూటిబిలిటీ (సిఈపి) ని ఫార్మాస్యూటికల్స్ పొందింది. ఈయుజిఎంపి సర్టిఫికేషన్ ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది, యూరోపియన్ మార్కెట్లకు అధిక-నాణ్యత గల మందులను సరఫరా చేయడం ద్వారా కంపెనీ తమ ప్రపంచ కార్యకలాపాలను మరింత విస్తరించడానికి వీలు కల్పిస్తుంది. పైడిభీమవరం కేంద్రం, గత సంవత్సరం ప్రారంభంలో యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ఎఫ్ డిఏ) నుండి అనుమతులు పొందింది. డబ్ల్యుహెచ్ఓ - జిఎంపి, సిడిఎస్సిఓ నుండి సర్టిఫికేషన్లతో పాటు, తాజాగా ఈయుజిఎంపి గుర్తింపుతో, ఈ కేంద్రం ఇప్పుడు బహుళ అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలను అందుకున్నట్లు అయింది. విశ్వసనీయ ప్రపంచ ఆరోగ్య సంరక్షణ భాగస్వామిగా అపర్ణ ఫార్మాస్యూటికల్స్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. ఈ గుర్తింపు గురించి అపర్ణ ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ పరిణామాలు అపర్ణ ఫార్మాస్యూటికల్స్కు ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తాయి. ఎందుకంటే మేము నాణ్యత, అత్యున్నత ప్రపంచ ప్రమాణాలను మా కార్యకలాపాలతో అనుసంధానించడం కొనసాగిస్తున్నాము. ఈయుజిఎంపి ఆమోదం, జీనోమ్ వ్యాలీలో మా ఆర్తిడి కేంద్రాన్ని ప్రారంభించడం వంటివి, ప్రపంచ స్థాయిలో ప్రామాణీకరణ, నిరంతర ఆవిష్కరణల పట్ల మా అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. ఈ విజయాలు నియంత్రిత మార్కెట్లకు సేవ చేయగల మా సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయి, సంక్లిష్ట అణువుల అభివృద్ధిని వేగవంతం చేస్తాయి, ప్రయోజనకర రంగాలలో ఆర్ &డి ని కొనసాగించగలవు, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో విశ్వసనీయ భాగస్వామిగా మారాలనే మా లక్ష్యం సాకారం చేస్తాయి" అని అన్నారు. దాదాపు 170,000 చదరపు మీటర్ల (ది40 ఎకరాలు) విస్తీర్ణంలో విస్తరించి ఉన్న పైడిభీమవరం కేంద్రం, ప్రస్తుతం బహుళ చికిత్సా రంగాలలో నెలకు సుమారు 250 మెట్రిక్ టన్నుల ఫార్మాస్యూటికల్ ఏపిఐ లు, అధునాతన ఇంటర్మీడియట్లను ఉత్పత్తి చేస్తుంది. తయారీ, ఆర్తిడి, ప్రమాణాల అనుసరణలో నిరంతర పెట్టుబడులతో, కంపెనీ రాబోయే ఐదు సంవత్సరాలకు 30% కంటే ఎక్కువ సిఏజిఆర్ లక్ష్యంగా పెట్టుకుంది, నియంత్రిత మార్కెట్ల నుండి బలమైన డిమాండ్, పోర్ట్ఫోలియో విస్తరణ, కస్టమ్ తయారీ ప్రాజెక్టులపై ప్రపంచ ఆరోగ్య సంరక్షణ భాగస్వాములతో విస్తృత స్థాయి భాగస్వామ్యాల ద్వారా ఇది సాధ్యం కానుంది. ఈ వృద్ధి వ్యూహానికి అనుగుణంగా, అపర్ణ ఫార్మాస్యూటికల్స్ యొక్క కొత్త ఆర్తిడి కేంద్రం తమ అంతర్గత ఉత్పత్తి పోర్ట్ఫోలియోను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుంది, అదే సమయంలో ప్రాధాన్యత సిడిఎంఓ భాగస్వామిగా తనను తాను నిలబెట్టుకోవడం, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ నాయకులకు వినూత్నమైన, నమ్మదగిన పరిష్కారాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## పచ్చదనంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 4,మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పరిసర ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ పచ్చదనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముందుగా గణపతి నవరాత్రులలో భాగంగా పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వయంగా మొక్కలు నాటారు. ఆలయ ప్రాంగణం పచ్చగా, శోభాయమానంగా మారాలని లక్ష్యంగా తీసుకుని ఈ కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని, వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోచింతల సీత రామయ్య,కర్లవెంకటనారాయణ,కర్ల నాగేశ్వరరావు, ధూళిపాళ్ల లక్ష్మణరావు, గజ్జి కృష్ణమూర్తి, జిల్లేపల్లి సుధీర్, చెంచు రమేష్, గింజుపల్లి గోపి, కొత్తపల్లి సతీష్, నల్లపునేని కొండ, నూతలపాటి వెంకటేష్, మాదినేని వెంకట్రావు, కాకాని శేషగిరి, కొల్లిపాక బ్రహ్మం, మాదినేని శివ, దుడ్ల కొండ, జిల్లేపల్లి ప్రభాకర్, కంభం చిరంజీవి, మూసిబోయిన కృష్ణ, చైనీ కొండ, పెనుగొండ గోపాలరావు, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు డైరెక్టర్ శ్రీనివాసరావు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో మెగా క్యాంప్ నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ బరోడా

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత్లో ప్రభుత్వరంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా, కేంద్ర ఆర్థిక శాఖలో భాగమైనఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కింద శాచురేషన్ క్యాంపెయిన్లో భాగంగా రాజమండ్రిలోమెగా క్యాంప్ నిర్వహించింది. ఈ క్యాంపెయిన్ 2025 జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకునిర్వహించబడుతోంది. దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు (జీపీ), అర్బన్ లోకల్ బాడీల(యూఎల్బీ) స్థాయిలో ఆర్థిక సమ్మిళితత్వం, సామాజిక భద్రత స్కీములకు సంబంధించి 100శాతం కవరేజీని సాధించాలనేది దీని లక్ష్యం. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ పి.ప్రశాంతిబీ బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్ త్యాగి, హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్ కుమార్తో పాటు నాబార్డ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, డీఐసీ జనరల్ మేనేజర్,డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎంఈపీఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లాంటి పలుప్రభుత్వ విభాగాలకు చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించబడింది. "మన జిల్లాసమగ్రాభివృద్ధి కోసం ఆర్థిక సమ్మిళితత్వం సాధించడం ముఖ్యం. కీలకమైన బ్యాంకింగ్సర్వీసులు, ప్రభుత్వ స్కీములను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా వారికి ఆర్థికభద్రత, మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ఈ మెగా క్యాంపు తోడ్పడింది" అని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ పి. ప్రశాంతికీలకోపన్యాసంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సమిష్టిగా పాలుపంచుకుంటున్న వారినిప్రశంసించారు. దీర్ఘకాలికంగా ఆర్థిక, సామాజిక అభ్యున్నతి సాధించేందుకు అందరూ ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. "అంతగాసేవలందని వర్గాలకు సాధికారత కల్పించే ఆర్థిక సమ్మిళితత్వ స్కీములను మరింతఅందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా కట్టుబడి ఉంది. ప్రభుత్వ దన్ను గలకీలకమైన పథకాలు మరింత మందికి చేరేలా, అర్హులైన పౌరులందరికీ ఆర్థిక భద్రత, సాధికారతలభించేలా చూడటంపై బ్యాంకు ప్రధానంగా దృష్టి పెడుతోందనడానికి రాజమండ్రిలో మెగాక్యాంపు నిర్వహణ నిదర్శనంగా నిలుస్తుంది. ఆర్థిక సమ్మిళితత్వ సాధనలో బ్యాంకులుపోషించే కీలక పాత్రకు నిదర్శనంగా ఇందులో పెద్ద యెత్తున ప్రజలు పాల్గొన్నారు. వి




నూత్నమైన, అందరికీ అందుబాటులో ఉండే బ్యాంకింగ్ సొల్యూషన్స్ను అందించడం ద్వారావివిధ వర్గాలకు మద్దతునివ్వడంలోనూ, వారి అభ్యున్నతికి తోడ్పడటంలోను బ్యాంకుచిత్తశుద్ధితో పని చేస్తోంది " అని బ్యాంక్ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్ త్యాగి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఎంట్రప్రెన్యూర్లు, ముఖ్యంగా బ్యాంక్ఆఫ్ బరోడా ఫైనాన్స్ చేసిన మహిళల విజయ గాథల గురించి తెలియజేయబడింది. అలాగే బరోడాడిఫెన్స్ శాలరీ ప్యాకేజీ కింద, ఒక్కొక్కటి రూ. 2 లక్షలు, రూ. 15 లక్షలుచొప్పున పీఎంజేజేబీవై క్లెయిమ్ సెటిల్మెంట్లకు సంబంధించిన చెక్కులు లబ్ధిదారులకుఇవ్వబడ్డాయి. అలాగే, కొత్త స్వయం సహాయక బృందాలు,, పరిశ్రమలకు ఫైనాన్సింగ్కోసం చెక్కులు అందించబడ్డాయి. 1,000 మంది పైగా ఈ క్యాంపులో పాల్గొన్నారు. ప్రధాన మంత్రిజన్ ధన్ యోజన (పీఎంజేడీవై) కింద పెద్ద ఎత్తున ఎన్రోల్మెంట్లు నమోదయ్యాయి. అలాగేవేదికలో ఏర్పాటు చేసిన పలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్బీవై), అటల్పెన్షన్ యోజన (ఏపీవై) స్టాల్స్లో సబ్స్క్రిప్షన్స్ నమోదయ్యాయి. కీలకమైన ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ సర్వీసులను అందుబాటులోతేవడం ద్వారా ఆర్థిక సమ్మిళితత్వాన్ని పెంపొందించడంపై, వివిధ వర్గాలకు సాధికారతకల్పించడంపై బ్యాంక్ ఆఫ్ బరోడాకి గల నిబద్ధతను ఈ కార్యక్రమం పునరుద్ఘాటిస్తుంది.

## సరికొత్త విక్టోరిస్ను విడుదల చేసిన మారుతి సుజుకీ




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత దేశపు ఎస్యువీ విభాగాన్ని పునర్నిర్వచిస్తూ మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ కొత్త ఎస్యువీ విక్టోరిస్ను విడుదల చేసింది. హైపర్-కనక్టెడ్ టెక్నాలజీ, సంపూర్ణమైన భద్రత, అధునాతనమైన, నాజూకైన డిజైన్ తో, అన్నీ కలిగి ఉన్న ఎస్యువీ అందచేసే ఉల్లాసకరమైన పెర్ఫార్మెన్స్తో విక్టోరిస్ నిరంతరంగా కలిసిపోతుంది, స్ట్రాంగ్ హైబ్రిడ్, ఆల్ గ్రిప్ సెలక్ట్, పర్యావరణానుకూలమైన ఎస్-సీఎన్జీ టెక్నాలజీతో పెట్రోలులో లభిస్తోంది. శ్రేణిలోనే మొదటి అండర్ బాడీ డిజైన్ తో, విక్టోరిస్ నేటి చురుకైన యువతకి అనుకూలమైన విస్తృత శ్రేణి పవర్ ట్రైన్ వ్యవస్థల్ని అందిస్తోంది. కస్టమర్లు తమ సరికొత్త విక్టోరిస్ను రూ.11,000కి బుక్ చేయవచ్చు.

## కొత్త హంగులతో ప్రారంభించబడిన కెటిఎం 160 డ్యూక్



**విజయవాడ మేజర్ న్యూస్ :** వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ, భవానీపురం, గుడివాడలో సరికొత్త కెటిఎం 160 డ్యూక్ ప్రారంభించబడింది. ఇది కెటిఎం నుండి అత్యంత సరసమైన ఎంట్రీ-లెవల్ బైక్, దీని ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ.1.85 లక్షలు. స్పోర్టీ లుక్, ఇంజిన్ రకం: లిక్విడ్-కూల్డ్, 4-స్ట్రోక్, సింగిల్-సిలిండర్, ఎస్ఓహెచ్సి, ఇంటర్నల్ కంబషన్ కలిగి ఉన్న ఈ కొత్త మోడల్. డిస్ప్లేస్మెంట్: 164.2 సిసి, గరిష్ట పవర్: 9500 ఆర్పిఎం వద్ద 19 పిఎస్, గరిష్ట టార్క్: 7500 ఆర్పిఎం వద్ద 15.5 ఎన్ఎం, గేర్బాక్స్: 6-స్పీడ్ ట్రాన్స్మిషన్ వెనుక సస్పెన్షన్: డబ్ల్యూపి మోనోషాక్ కెర్బ్ బరువు: 147 కిలోలు, ఇంధన ట్యాంక్ సామర్థ్యం: 10.1 లీటర్లు. వీల్స్ & టైర్లు: ట్యూబ్ లెస్ తో 17-అంగుళాల అల్లాయ్ వీల్స్. లైటింగ్: ఎల్ఈడి హెడ్లైట్లు, టెయిల్ లైట్లు, టర్న్ ఇండికేటర్లు. ఇన్స్ట్రుమెంటేషన్: బ్లూటూత్ కనెక్టివిటీతో 5-అంగుళాల ఎల్సిడి ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సి ఈవో ఏ.శ్రీనివాస్, జిఎం సురేష్, ఏఎస్ఎం గోపీచంద్, బిఎం కిషోర్ పాల్గొన్నారు.

## జ్యోతిర్మయ్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 4, మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం గ్రామంలో ఉన్న జ్యోతిర్మయి విద్యానికేతన్ లో ఆ పాఠశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వల్లాపురపు వెంకట బాబు నేతృత్వంలో ఘనంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సర్వేపల్లి.రాధాకృష్ణన్ వారి138వ జయంతి ని పురస్కరించుకుని. ఉపాధ్యాయదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయురాలు వల్లాపురపు. సులోచన రాణి మాట్లాడుతూ సాదారణ రైతు కుటుంబం లో జన్మించిన రాధాకృష్ణన్ భారతదేశ రాష్ట్రపతి గా ఏవిధంగా ఎదిగారో వివరించారు..కార్యక్రమంలో పిల్లలు ఉపాద్యాయులు గా మారి పాఠాలు భోదించటం అందరిని ఆకట్టుకుంది. తదుపరి విద్యార్థులు ఉపాద్యాయులను సన్మాణించి గురువుల నుండి ఆశ్వీర వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మార్కాపురపు విజయ, సిహెచ్ రాణి, జిడుగు సంధ్యా,పూజిత, సౌజన్య,జగదీష్, తేరోజమ్మ, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వెంకట రాయుడు మృతికి ఘననివాళులర్పించిన ఎమ్మెల్యే వసంత



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** గుంటుపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి వెంకట రాయుడు ఇటీవల మృతి చెందారు. గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాల్లో ఆయన సంస్మరణ కార్యక్ర మాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ),ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## ఏజెంట్లకు ఆరోగ్య పరీక్షా శిబిరం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** 69వ భీమా వారోత్సవం సందర్భంగా గురువారం అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో ఏజెంట్లకు ఆరోగ్య పరీక్షా శిబిరాలు జరిగాయి. ఉచిత దంత వైద్యశిబిరం, ఉచిత నేత్ర పరీక్షా శిబిరం, ఉచిత డయాబెటిక్ ఆరోగ్యపరీక్ష శిబిరాలను నిర్వహించారు. ఏజెంట్లు పెద్ద ఎత్తున ఆయా శిబిరాల్లో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. విష్ణు దంతవైద్యశాలకు చెందిన డాక్టర్ ఆర్ఎన్.శంకరానంద్, శివరామకృష్ణ కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ శివరామకృష్ణ, కోనాక్ డయాగ్నస్టిక్స్ కు చెందిన డాక్టర్ సాయిబాబాలు శిబిరంలో సేవలందించారు. ఈ సందర్భంగా షుగరు వ్యాధిగ్రస్థుల నుంచీ రక్తనమూనాలు సేకరించారు. షుగరు వ్యాధి, నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ సాయిబాబా అవగాహన కల్పించారు. ఎల్ఐసి బీఎం ఆకుల హరిప్రసాద్, ఎస్బీఎం రామయ్యలు శిబిరాలను పర్యవేక్షించారు.

## కూరగాయ వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** చెత్త నుండి సంపద తయారీ కార్యక్రమాలు భాగంగా కూరగాయ వ్యర్థలతో కంపోస్ట్ తయారీని చేసుకోవాలని సర్పంచ్ డాక్టర్ దాసరి విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద కంపోస్ట్ తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పళ్ళు,కూరగాయల వ్యర్థాలను సేకరించి కంపోస్ట్ తయారు చేయడం ద్వారా ఆదాయ వనరులు పెంపొందించుకోవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో బి.అనిత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వాకాలమ్మ తల్లి ఆలయ డైరెక్టర్‌గా వీర వెంకటేశ్వరరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వాకాలమ్మ తల్లి దేవస్థాన పాలకమండలి సభ్యునిగా జనసేన పార్టీ నాయకులు వేముల వీర వెంకటేశ్వరరావు మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ,దేవస్థాన చైర్మన్ మెండు భానుమూర్తి సమక్షంలో దేవస్థాన కార్య నిర్వహణ అధికారి వెంకటేశ్వరరావుచే ప్రమాణ పత్రం చదివించి పాలక మండలి సభ్యునిగా వేముల వీర వెంకటేశ్వరరావు నియామకాన్ని ధ్రువీకరించారు.అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వేముల వీర వెంకటేశ్వరరావుకు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గోవిందు నాగేశ్వరరావు, గడ్డంరాజు బండి శివ,కాటం మధు,శ్రీపతి చంద్రం,కటికల సుబ్బారావు, పోసిన వెంకటేశ్వరరావు,పిప్పళ్ల తిరుమలరావు, పామర్తి నాగరాజు, వీరనాల వీరబాబు, తోటరాజేష్, రాజు,తలారి బసవయ్య, తాతనాగేంద్రం, కసిలింక నాగేశ్వరావు,గంధం ఆంజనేయులు వాకాలమ్మ తల్లి ఆలయ ప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్ స్కూల్లో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

**బంటుమిల్లి మేజర్ న్యూస్:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గురువారం బంటుమిల్లి సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అంగరంగ వైభవంగా ఈకార్యక్రమం నిర్వహించారు. బంటుమిల్లి విద్యాశాఖ అధికారి 1 ఎం.మొబిన్ భాను, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొని పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాధాకృష్ణన్ జీవితం యొక్క గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు తమ జీవితాలను ఏ విధంగా తీర్చి దిద్దుకోవాలి, విద్యార్థులు ఉన్నత విలువలు, నైతిక విలువలు కలిగినటువంటి వ్యక్తులుగా తీర్చిదిద్దవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు ఈ కాలంలో విద్యార్థులపై విపరీతమైన ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా మొబైల్ ఫోన్లో వంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాబుజాన్ హెడ్ మిస్టరీస్ ఝాన్సీ సాబ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# రైతాంగ అభ్యున్నతే ఎజెండాగా ముందుకు సాగుతున్నా..





## సందడి వాతావరణంలో పెంజెండ్ర పిఏసిఎస్.కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాలు

### రైతన్నల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పని చేద్దాం : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడివాడ నియోజకవర్గ పరిధిలోని రైతాంగ అభ్యున్నతే ఎజెండాగా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో అందరం కలిసి పని చేద్దామని కూటమి నాయకత్వానికి ఆయన పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు మండలం పెంజేంద్ర వ్యవసాయ పరపతి సహకార సంఘాల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు గురువారం ఉదయం ఘనంగా జరిగింది. ముందుగా కార్యక్రమంలో పాల్గొన్నందుకు వచ్చిన ఎమ్మెల్యే రాముకు గ్రామ పొలిమేరలో కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు.భారీ బైక్ ర్యాలీగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, రైతులు ఆత్మీయ స్వాగతం పలికారు. పెంజేంద్ర పాలకోడు డ్రైన్‌కు మరమ్మతులు నిర్వహించి సమస్య పరిష్కరించినందుకు స్థానిక రైతులు ఎమ్మెల్యే రాముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొప్పన శివప్రసాద్, డైరెక్టర్లు పెనుమాక చిట్టిబాబు, సయ్యద్ ఖరీదులను ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడారు... గుడివాడ నియోజకవర్గ రైతాంగ అభ్యున్నతే ఎజెండాగా పనిచేస్తూ అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. గ్రామాల్లోని రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి నాయకత్వం అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పై స్థాయికి వెళ్లి పరిష్కరిస్తానన్నారు. సహకార సంఘాల కమిటీలుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ తమ పదవులను బాధ్యతగా భావిస్తూ రైతాంగానికి చేయూతనిచ్చే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రైతాంగ సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, మండల టిడిపి అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, టిడిపి నాయకులు వల్లభనేని వెంకటరావు,చేకూరు జగన్మోహన్రావు, సాయన పుష్పావతి, జంగం మోహన్ రావు, యుగంధర్, వీరమాచినేని శివప్రసాద్, పరంధమయ్యా, అట్లూరి శ్రీరామచంద్ర ప్రసాద్, సాయన ప్రసాద్,రంగబాబు,పటాన్ జై ముల్లా ఖాన్, వెనిగళ్ళ నాగేశ్వరరావు, కొడాలి రామరాజు, ఇచ్చేశ్వరరావు, ఈడే మోహన్,అట్లూరి స్వరూప్, నవాబు జనసేన పార్టీ నాయకులు సాదరబోయిన రాము, సయ్యద్ షఫి, ఖలీల్, రేమల్లి జోజి,గ్రామ నాయకులు గోడపాటి వెంకటేశ్వరరావు (కన్న), సయ్యద్ షాజహాన్, లోయ వెంకటేశ్వరరావు, రేమల్లి పెంటయ్య, జక్కుల కోటేశ్వరరావు, గోడపాటి సూర్యుడు, మూల కొండ, జయప్రకాష్, కోరే రమేష్, నూతలపాటి ప్రేమ సాయి, గుండాబత్తిన దాస్, సుభాని, గారపాటి నాగరాజు, సుభాన్ ఖాన్, జక్కుల స్వామి, పెద్ద సంఖ్యలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ గ్రామ కమిటీల నియామకం





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు మండలంలోని ఎలకుర్రు, ప్రాకెర్ల గ్రామాల లో పర్యటించిన మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆయా గ్రామాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ నాయకులు, కార్యకర్తలతో చర్చించిన అనంతరం పార్టీ కమిటీలను ఆయన అధికారికంగా ప్రకటించారు. ఎలకుర్రు గ్రామ కమిటీ అధ్యక్షునిగా పానే కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా బడుగు నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా దండాబత్తిన నాగరాజు, కొనకాల వెంకట్రావు, పానే సాయిబాబు కార్యదర్శులుగా గౌపర్ణ వెంకటేశ్వరరావు, పెదపూడి వెంకటేశ్వరరావు, మేకల నాగేశ్వరరావు, అచ్చన రామకృష్ణ లను నియమించారు. అలాగే ప్రాకెర్ల గ్రామ కమిటీ అధ్యక్షులుగా గొంతుపులి రామలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శులుగా మాతంగి వెంకన్న, కాపవరపు నాగరాజు, గొంతుపులి జాన్ బాబు, నత్తా వాసుదేవరావు, కార్యదర్శులుగా నక్కబుద్ధి ఆంజనేయులు, మేడేపల్లి రాంబాబు, గొంతుపులి మాణిక్యాలరావు, ప్రాకర్ల వీర రాఘవయ్య లు నియమితులయ్యారు.

## వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె రాంజీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విధానం నేటి విద్యార్థినీ విద్యార్థులకు అలాగే ఉపాధ్యాయు లకు ఆచరణీయం కావాలని అభిలషించారు.దేశానికి రాష్ట్రపతిగా పని చేసినా ఆయన దేశ ప్రజలకు ఒక ఉపాధ్యాయునిగానే గుర్తుండాలి అని పలు ప్రసంగాల్లో చెప్పుకునేవారని గుర్తు చేశారు.అలాగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాలలోని మూడు విభాగాలైన సిఎస్ఇ, ఈసిఈ, సైన్స్, హ్యూమానిటీస్ నుండి ముగ్గురు అధ్యాపకులను ఉత్తమ ఉపాధ్యాయులుగా నిర్ణయించి సత్కరించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా ఆర్ విజయ్ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య సుందర కృష్ణ, డా బాబు రెడ్డి, డా ఆర్ కిరణ్ కుమార్, డా డి రామశేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల బోధనా సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# యలకుర్రు, ప్రాకర్ల గ్రామాలలో 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' నిర్వహణ



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు మండలం యలకుర్రు గ్రామంలో నిర్వహించిన "బాబు షూరిటీ – మోసం గ్యారంటీ" కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలతో సహా వందకు పైగా హామీలను ప్రకటించారని, అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కాలేదని విమర్శించారు "తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని, ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 సం.లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500లు, సం.నికి రూ.18,000లు అందిస్తామని హామీ ఇచ్చి నీచంగా మోసం చేశారన్నారు. అలాగే దీపం పథకం కింద సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పినప్పటికీ, ఏడాది గడిచినా ఈ హామీ నెరవేరలేదని విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఈ మోసాలను ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాల గురించి తెలుసుకోవాలని కైలే అనిల్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీలు ఆరుమళ్ళ రమాదేవి, కారేపల్లి శ్రీనివాసరావు, జిల్లా, మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం ప్రాకర్ల గ్రామంలో కూడా "బాబు షూరిటీ – మోసం గ్యారంటీ" కార్యక్రమాన్ని నిర్వహించగా నాయకులతోపాటు పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాడంకి శివారు రెడ్డిపాలెం లో గణేష్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తాడంకి గ్రామ శివారు రెడ్డిపాలెంలో ఏర్పాటుచేసిన వినాయకుని చలువ పందిరి వద్ద ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై ఆయన స్పందిస్తూ ఇప్పటికే గ్రామంలో పలు సిసి రోడ్లు అభివృద్ధి పరిచామని, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని వారికి హామీ ఇచ్చారు. గ్రామంలో రోడ్ల నిర్మాణం, నివేశన స్థలాలు కావాలని ఆయనను కోరారు. వీటన్నింటిపై తాను ప్రత్యేకంగా దృష్టి సారించి వారి సమస్యలు త్వరిత గతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దైవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన తాను ఈ సమయంలో రాజకీయాలు మాట్లాడటం భావ్యం కాదంటూ మరోసారి గ్రామంలో పర్యటించి సమస్యలపై దృష్టిసారిస్తానని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, మైనేని నరేంద్ర, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు లతోపాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వసంతని కలిసిన నాదెండ్ల బ్రహ్మం




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ని, రాష్ట్ర కమ్మ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన నాదెండ్ల బ్రహ్మం చౌదరి విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు కొండపల్లి బొమ్మను జ్ఞాపికగా అందజేశారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు సేవలందించాలని సూచించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# దివిసీమ గాంధీ మండలి వెంకటకృష్ణారావు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ దివిసీమ గాంధీగా మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు అన్నారు. స్వర్గీయమండలి కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వంతెన సెంటరులో స్వర్గీయ మండలి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిట్టి బాబు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పిలుపు మేరకు విద్యార్థి దశలోనే స్వాతంత్ర ఉద్యమంలో చేరిన కృష్ణారావు రాజకీయ వేత్తగాను గాంధీజీ చూపిన మార్గంలో పయనించి దివిసీమ గాంధీగా గుర్తింపు పొందారన్నారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, అవనిగడ్డ గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి అధ్యక్ష కార్యదర్శులు పుప్పాల వీరాంజనేయులు, కూనపరెడ్డి చంద్రశేఖర్, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ మాదివాడ రత్నారావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నేతలు మండలి అభిమానులు పాల్గొన్నారు.

# రైతు సంఘాలకు అవగాహన సదస్సు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వ్యవసాయం, అనుబంధ రంగాలలో గ్రూపులుగా ఏర్పడి బ్యాంకు రుణాలు పొందడం ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచుకోవాలని ప్రాంతీయ విజిలెన్స్ అధికారి కే వెంకటరాజు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అవనిగడ్డ బ్రాంచ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా గ్రూపులుగా ఏర్పడిన ఎఫ్ పి జి, ఎఫ్ పి ఓ లకు వ్యవసాయ, అనుబంధ సంస్థలలో జీవనోపాదులకై రుణాలు ఇచ్చేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ టి వి వరుణ్ వ్యవసాయ రుణ విభాగాధికారి వై భాను ప్రవీణ్ వెలుగు డి పి ఎం సుధాకర్ ఏపిఎం శ్రీనివాస్ దాదాపు 70 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. నేడు కొన్ని ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం అవనిగడ్డ మేజర్ న్యూస్ మండల కేంద్రమైన అవనిగడ్డ లోను మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో ఉదయం 8 నుండి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి కృష్ణ నాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు మంత్లీ షెడ్యూల్లో భాగంగా శుక్రవారం అవనిగడ్డ మండలం నాగాయలంక రోడ్ లో గల కొత్త సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి అవనిగడ్డ 3(లంకమ్మమాన్యం)ఫీడర్ విద్యుత్ లైన్లపై వాలిన చెట్లకొమ్మలను ట్రిమ్ చేయటం కొరకు కొత్త సబ్ స్టేషన్, అవనిగడ్డ గ్రామములో 3,5,6 వ వార్డులలో కొత్తపేట, రామకోటిపురం, తిప్పపాలెం గ్రామములలో ఉదయం 08:00 గంటల నుంచి 12:00 గంట వరకు విద్యుత్ అంతరాయము కలుగును కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

## నేటి నుంచి మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని చీమలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దివ్య ఆశీస్సులతో జంపని గ్రామంలోని ఏఏ బి.ఎస్.టి.ఏ దర్బార్ లో నేటి నుంచి నాలుగు రోజులపాటు మొహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరి అత నిజాం బాబా తెలిపారు. 4,5,న మీలాదున్ నబి, మొహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు 6న మహనీయులు హజరత్ సాబీర్ కలియరి మహత్ములవారి ఉరుసు, 7న హజరత్ ఖూతుబుద్దీన్ కాకి మహాత్ములవారి ఉరుసు, మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నాలుగు రోజులపాటు వేలాది మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## శ్రీ సత్యనారాయణస్వామి ఆలయాభివృద్ధికి విరాళం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు కీ.శే. ముత్తిరెడ్డి మల్లేశ్వరరావు స్మారకార్థం కుమారులు శ్రీనివాసరావు & బ్రదర్స్ రూ.55,116లు విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు మంగళవారం అందించారు. మండల టీడీపీ అధ్యక్షులు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని కష్ణప్రసాద్(నాని), ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, కొప్పరావూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు తెలిపిన అనపర్తి పద్మావతి



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 4 మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఇటీవల విడుదల చేసిన పలు కార్పొరేషన్ చైర్మన్ నియామకాలలో భాగంగా రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కలపాటకు బుచ్చి రామ ప్రసాద్‌ను జగ్గయ్యపేట పట్టణానికి చెందిన అనపర్తి పద్మావతి అభినందనలు తెలియజేశారు. అనపర్తి పద్మావతి జగ్గయ్యపేట నియోజకవర్గస్థాయిలో అనేక సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గ మానవ హక్కుల సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తూ బ్రాహ్మణ సంక్షేమ సంఘం లో కూడా అనేకమంది పేదవారికి, బడుగు బలహీన వర్గాల వారికి తన వంతుగా అనేక సహాయ సహకారాలు అందించినది. బ్రాహ్మణ కార్పొరేషన్ కు చైర్మన్ గా నియామకం కాబడిన బుచ్చి రామ ప్రసాద్ కు శుభాభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గార్లపాటి రాజ్యలక్ష్మి,గండికోట లీలావతి, ములుగు వాణిశ్రీ తదితర తెలుగు మహిళలు ఆయనను కలిసి శుభాభినందన తెలియజేశారు.

## గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో తృటిలో తప్పిన ప్రమాదం



**గన్నవరం, సెప్టెంబర్ 4, మేజర్ న్యూస్ :** గన్నవరం విమానాశ్రయంలో గురువారం సాయంత్రం పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. విమానాశ్రయం నుండి బెంగళూరుకు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో పక్షి ఒకటి ఇంజిన్ ఫ్యాన్ రెక్కలకు తగలడంతో ఇంజిన్ అకస్మాత్తుగా ఆగిపోయింది. సమయస్ఫూర్తి ప్రదర్శించిన పైలట్ వెంటనే రన్‌వేపై సురక్షిత ల్యాండింగ్ చేశారు. ఈ విమానంలో సుమారు 100 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విమానంలో ఉన్న ప్రయాణికులంతా క్షేమంగా బయటపడటంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.

## ఐనపూరు హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



పమిడిముక్కల మేజర్ న్యూస్ : మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని వారిలాగా గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఒక సామాన్య ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగారని, విద్యార్థులు అందరూ వారి యొక్క అడుగుజాడల్లో నడుస్తూ, వారిలాగా గొప్ప స్థాయికి ఎదిగి, కన్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులందరికీ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. పాఠశాలలోనే విద్యార్థులందరూ కలిసి ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులు బుజ్జమ్మ, నాగేశ్వరరావు లను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులందరినీ సాంప్రదాయబద్ధంగా తాంబూలాలతో, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## పాత రావిచర్లలో ఆధ్యాత్మిక వాతావరణం



**గన్నవరం (పాత రావిచర్ల), సెప్టెంబర్ 4, మేజర్ న్యూస్ :** పాత రావిచర్ల గ్రామంలో గురువారం గణనాథుని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పాత రావిచర్ల గౌడపేట సెంటర్లో చవితి పూజలను అందుకుంటున్న గణనాథుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు రామకృష్ణ, రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారధి తనయుడు, నూజివీడు నియోజకవర్గ యువ నాయకుడు కొలుసు నితిన్ కృష్ణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో సకల విఘ్నాలు తొలగి, అందరికీ శుభం కలగాలని వారు ఆకాంక్షించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రముఖ అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తరువాత గణనాథుని ఊరేగింపు పాత రావిచర్ల గ్రామ పరిధిలో సాంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒకే రోజు ఐదు విగ్రహాలకు లంక లితీష్ విరాళాలు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం లోని వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా పలు విగ్రహాలను ఏర్పాటు చేయగా గురువారం ఒకేరోజు ఐదు వినాయకుని విగ్రహాల మండపాల వద్ద జరుగు పూజా కార్యక్రమాల్లో తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బోళ్ల లోలా బజారు, గౌడ బజారు,వడ్డెర బజార్ లోని విగ్రహాల మండపాలు మొత్తంగా ఐదు విగ్రహాల మండపాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలలో పాల్గొని, ఆ వినాయకుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ, మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ ప్రతి విగ్రహ కమిటీకి 5000/- రూపాయల చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత, భక్తులు, విగ్రహ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# నిబద్ధత కలిగిన వ్యక్తి గుత్తా రత్నం



**కంచికచర్ల, సెప్టెంబర్ 4 మేజర్ న్యూస్ :** క్రమశిక్షణకు మారుపేరు నిబద్ధత కలిగిన వ్యక్తి గుత్తా వీర వెంకటరత్నం అని ప్రభుత్వ విప్ నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య కొనియాడారు. గురువారం కంచికచర్ల ప్రాథమిక సహకార పరపతి సంఘం చైర్మన్గా ప్రమాణ స్వీకారం గుత్తా రత్నం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ గుత్తా వీర వెంకటరత్నం మాటల మనిషి కాదు, చేతల మనిషి అని ఆయన ఏ కార్యక్రమాన్నైనా చాలా సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహిస్తారని అన్నారు. నాకు నచ్చే వ్యక్తులలో గుత్తా రత్నం ఒకరిని ఆయన నాయకత్వంలో సహకార పరపతి సంఘం కంచికచర్ల ప్రాంతంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని నమ్మకం ఉంది" అని ప్రశంసల జల్లు కురిపించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ ప్రధాన రాష్ట్ర కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తో కలసి సౌమ్య గుత్తా రత్నానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూరత్నం నిబద్ధత, సమాజ సేవా దృక్పథాన్ని కొనియాడారు. కంచికచర్ల సహకార సంఘం అధ్యక్షుడిగా రత్నం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా పనిచేస్తారని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు) కూటమి నేతలు, స్థానిక నాయకులు, సహకార సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుత్తా వీర వెంకటరత్నంకు తమ శుభాకాంక్షలను తెలియజేశారు. గుత్తా వీర వెంకటరత్నం తన ప్రమాణ స్వీకార ఉపన్యాసంలో, సహకార సంఘం ద్వారా రైతులు, సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి తనవంతు కృషి చేస్తానని, పారదర్శకమైన, సమర్థవంతమైన నిర్వహణతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

## హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్గా రామలింగేశ్వరరావు



**పామర్రు మేజర్ న్యూస్ :** రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ పాలక మండలి సభ్యునిగా నియమితులైన మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావుకు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన పాలకవర్గ జాబితాలో రామలింగేశ్వరరావు పేరు చోటు చేసుకోవడంతో గురువారం ఆయనను ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కుమార్ రాజా కృషితో తనకు ఈ పదవి లభించిందన్నారు. ఇందుకు సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనపై నమ్మకంతో పార్టీకి అందించిన సేవలను గుర్తించి తనకు ఈ పదవిని అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో తనకు అందించిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహించి గృహ నిర్మాణ శాఖలో పేదలందరికీ ఇళ్లు అందేలా చూస్తానని రామలింగేశ్వర రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సెయింట్ జాన్ స్కూల్లో ఘనంగా టీచర్స్ డే వేడుకలు




**బంటుమిల్లి మేజర్ న్యూస్:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గురువారం బంటుమిల్లి సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. బంటుమిల్లి విద్యాశాఖ అధికారి 1 ఎం.మోబిన్ భాను, వెంకటేశ్వర్ మండల విద్యాశాఖ అధికారి2 పాల్గొని పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాధాకృష్ణన్ జీవితం యొక్క గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు తమ జీవితాలను ఏ విధంగా తీర్చి దిద్దుకోవాలి, విద్యార్థులు ఉన్నత విలువలు, నైతిక విలువలు కలిగినటువంటి వ్యక్తులుగా తీర్చిదిద్దవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు ఈ కాలంలో విద్యార్థులపై విపరీతమైన ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా మొబైల్ ఫోన్లో వంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాబుజాన్ హెడ్ మిస్ట్రెస్ ఝాన్సీ సాబ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## గణనాథుని ఉత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** గణనాథుని నవరాత్రి ఉత్సవాల వేడుకల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. కొండపల్లిలోని ప్రధాన సెంటర్లో చవితి పూజలను అందుకుంటున్న గణనాథుడిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. వినాయక స్వామి వారికి హారతినిచ్చారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో విఘ్నాలు తొలగి, అందరు సంతోషంగా ఉండాలని, అందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. గణపతి నవరాత్రుల నిర్వాహక ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వసంతని కలిసిన అంకెమ్ ఇందిరా ప్రియదర్శిని



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన జి.కొండూరుకు చెందిన విజయవాడ పార్లమెంట్ తెలుగు మహిళ కార్యదర్శి అంకెమ్ ఇందిరా ప్రియదర్శిని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారువిజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదుని ఆమె గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆమెను, ఆమె భర్త అంకెమ్ సురేష్ ని శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాలని వారికి సూచించారు. ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు ఎల్.ఓ.సిలను అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు, శస్త్రచికిత్సల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం మంజూరైంది. ఈ సాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో లబ్ధిదారులకు ఎల్.ఓ.సిలరూపంలోగురువారంఅందజేశారు.విజయవాడ రూరల్ మండలంలోని జక్కంపూడి జెఎన్ఎన్యూఆర్ఎం కాలనీ చెందిన షేక్ ఖాశింకు రూ.1.25 లక్షలు, ఇదే కాలనీ నివాసితులు షేక్ బీబీ జాన్ కు రూ.1.50 లక్షలు, రెడ్డిగూడెం మండలంలోని కూనపరాజుపర్వకు చెందిన మోటమర్రి శంకరచార్యులుకు రూ.2.50 లక్షలు, ఇబ్రహీంపట్నంకు చెందిన ఘంటసాల నాగమణికి రూ.2.50 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి గురించి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి) రూపంలో మంజూరయ్యాయి. వీటిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బాధిత కుటుంబాలకు అందజేశారు. మొత్తం నలుగురికి రూ.7.75 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. తక్షణమే వైద్య సేవలు చేయించుకుని, వారంతా ఆరోగ్యకరంగా ఉండాలని ఆకాంక్షించారు. నిస్సహాయస్థితిలో ఉన్న వారికి తక్షణమే సాయాన్ని మంజూరు చేస్తున్న సీఎం చంద్రబాబు కి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన దొండపాటి విజయ కుమార్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం నియోజకవర్గ పరిధిలోని కీర్తిరాయుని గూడెం గ్రామానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొండపాటి విజయకుమార్ ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. దీన్ని పురస్కరించుకుని మైల వరం శాసనసభ్యులు వసం త వెంకట కృష్ణప్రసాదుని గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో దొండపాటి విజయ్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆయన్ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు





**కంచికచర్ల సెప్టెంబర్ 4 మేజర్ న్యూస్ :** స్థానిక ఓసి క్లబ్‌లో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొని, ఉపాధ్యాయులకు సన్మానం చేసి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగాసౌమ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది, ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులైన ఉపాధ్యాయుల స్థానం అత్యంత గౌరవనీయం అని అన్నారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ రోజు ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారికి గౌరవం అందించే సందర్భమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె అందరు ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, యువనేత నారా లోకేష్ సేవలను కూడా తంగిరాల సౌమ్య కొనియాడారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన నారా లోకేష్కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి కృషి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఆమె పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకాలు వేగవంతం కావడమే కాకుండా, విద్యారంగంలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించే దిశగా అడుగులు పడుతున్నాయని ఆమె వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు కూటమి నేతలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఉపాధ్యాయులకు సన్మానాలు అందజేసి, వారి కృషిని గౌరవించిన ఈ కార్యక్రమం, విద్యా రంగంపై సమాజంలో ఉన్న గౌరవాన్ని మరోసారి ప్రతిబింబించింది.

# తాడంకి లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం తాడంకి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయసంచాలకులు సునీల్ అధ్యక్షతన గ్రామ రైతులు, పిఏసిఎస్, ప్రజా ప్రతినిధులతో యూరియా మీ చెంతకు అనే అంశం పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సునీల్ మాట్లాడుతూ రైతులు అధిక యూరియా వినియోగం ను చేపట్టరాదని తెలిపారు. అధిక యూరియా వినియోగం వలన రసం పీల్చు పురుగుల ఉధృతి పెరుగుతుందని తెలిపారు, ఎంటియు -1318 రకం వరి లో అధిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. మోతాదుకు మించి యూరియా వాడటం వలన పైరు పెరిగి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువుల వినియోగం వలన 50శాతం యూరియా వినియోగం ను తగ్గించుకోవచ్చునన్నారు. యూరియా గురించి రైతులు ఆందోళన చెంద వద్దని దశ ల వారి ప్రభుత్వం అందిస్తుందని, పిఏసిఎస్ లకు వారం లోగా యూరియా వస్తుందని తెలిపారు. అలాగే సామూహిక ఎలుకల నివారణకు కి ఎలుకల మందు ను వ్యవసాయ శాఖ 100 శాతం రాయితీ పై రైతులకి అందిస్తోందని, కావున ఎలుకల మందునకు నూకలు, నూనె కలిపి తయారు చేసుకొని రైతులంతా ఒకేసారి ఎలుకల నివారణ చేపట్టాలని సూచించారు. ఈనెల 30వ తేదీతో ఈ పంట నమోదు ప్రక్రియ ముస్తుందని, కావున రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు. వ్యవసాయం లో డ్రోన్ ల వినియోగం పెంచుటకు ప్రభుత్వం డ్రోన్ లను సబ్సిడీ పై అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ సమావేశం లో మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, గ్రామ వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు



## ఎంబిఎం హైస్కూల్లో గురువులకు ఘన సత్కారం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మైలవరంలోని ఎంబిఎం హైస్కూల్లో గురువారం గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీచర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లకు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మైక్ బాబురావు బహుమతులు అందించి వారిని ఘనంగా సత్కరించారు. మహిళా టీచర్లకు సాంప్రదాయ బద్ధంగా తాంబూలం(పసుపు, కుంకుమ, జాకెట్, ఆకు, ఒక్క) పంపిణీ చేశారు. పురుష టీచర్లకు, నాన్ టీచింగ్ స్టాఫ్ కు స్టీల్ బాక్స్ లను పంపిణీ చేశారు. సమాజంలో గురువులు దైవంతో సమానమని, సమాజాన్ని ఉద్ధరించేది గురువులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గురువులందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్, పలువురు దాతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలికలను ఉన్నత స్థాయిలో నిలపాలి




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మొవ్వ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చల్లపల్లి మండలం రామానగరంలో సచివాలయం మూడులో సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం గురువారం ఉదయం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళలు గర్భిణీ స్త్రీలు బాలింతలు కిషోర్ బాలికలు తో పాటు తదితరులు పాల్గొన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న మొవ్వ ఐసిడిఎస్ సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ మాట్లాడుతూ మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు అంతేకాకుండా పిల్లలను మగ అనే తేడా లేకుండా పెంచడం ద్వారా బాలికలు ఉన్నత స్థాయిలో నిలవగలుగుతారన్నారు చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహం చేయడం మంచిది కాదని ఇది చట్ట వ్యతిరేకమని తెలుపుతూ చిన్న వయసులో వివాహం చేయకుండా వారిలో సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ఆలోచన చేయవలసిన అవసరం ఉందన్నారు పిల్లల పట్ల తల్లి దండ్రులు కుటుంబ సభ్యులు బాధ్యతగా ఎలా ఉండాలో వివరిస్తూ అవగాహన కల్పించారు లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయసులో పిల్లలను క్రమశిక్షణతో పెంచడం ద్వారా వారు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు చిన్న వయసులో పిల్లలకు వివాహం చేసే విధానాన్ని విడనాడి పిల్లలను చదివించాలని సూచించారు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇస్రాంతమ్మ ఆదిలక్ష్మి లు మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు బాలికలను చదివించాలని చదివించినప్పుడే వారు ఉన్నత స్థాయిలో నిలవగలుగుతారని తెలిపారు బాలికలు అన్ని రంగాలలో ముందంజలో నిలుస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ బాలికలు చదువుకున్న అప్పుడే వారు జీవితంలో ముందుకు సాగగలుగుతారని సూచించారు ఈ కార్యక్రమంలో సచివాలయం మూడు అధికారులు కిరణ్ మై సచివాలయ షకీరా లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొండపాటి విజయ్ కుమార్

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని కీర్తిరాయునిగూడెం గ్రామానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొండపాటి విజయ్ కుమార్ ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. దీన్ని పురస్కరించుకుని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ని వారి కార్యాలయంలో దొండపాటి విజయ్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని ఆయన్ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, మాజీ జెడ్పిటీసీ దొండపాటి రాము, మైలవరం సీనియర్ నాయకులు మద్దినేని శ్రీనివాసరావు, మైలవరం తెలుగు యువత నాయకులు చీపు వంశీ కృష్ణ, తిరువూరు తెలుగు యువత అధ్యక్షులు పిట్టా చైతన్య, టీఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, ఎన్టీఆర్ జిల్లా ఐటిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నక్కనబోయిన దుర్గా జగదీష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జయరాం అనుచిత వ్యాఖ్యలపై సీపీఎం ధర్నా



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** అనంతపురం జిల్లా గుంతకల్లు శాసనసభ్యులు జయరామ్ అనుచిత వ్యాఖ్యలపై గురువారంసాయంత్రం బంటుమిల్లిలో అంబేద్కర్ సెంటర్ వద్ద లంకదాసుల అజయ్ ఘోష్ అధ్యక్షతన నిరసన ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే జయరామ్ అనుచిత వాఖ్యలను ఖండించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి ని గుత్తి గ్రామంలో సోలార్ ఇండస్ట్రీకి రైతుల భూములు అన్యాయంగా తీసుకునే సందర్భంలో ఆ సమస్యపై రైతులకు న్యాయం జరగాలని చేసే పర్యటన సందర్భంగా గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరామ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డిని అక్రమంగా, అనుచితంగా అమానుషత్వంగా మాట్లాడటాన్ని ఖండించారు. రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు సదరు ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు కోరారు. రైతులకు సరిపడా యూరియా అందించాలని, ఆక్వా రొయ్య రైతుల పై అమెరికా ట్రంపు విధించిన భారీ సుంకాలకు నష్టపోతున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు, కృత్తివెన్ను మండలం రైతుసంఘం అధ్యక్షులు పట్టపు ఏసుబాబు, రైతులు గౌరిశెట్టి వీరబాబు గౌరిశెట్టి నారాయణ, కాగిత ఆంజనేయులు, షేక్ వహీద్ అహ్మద్,కూనపురెడ్డి చిన వెంకటేశ్వరరావు, కార్మిక నాయకులు వంగల రాజు, కె.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

## బుడమేరు ప్రవాహంలో అడ్డంకులు లేకుండా చర్యలు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** బుడమేరులో నీటి ప్రవాహం అంతరాయం లేకుండా ఉండేందుకు గురువారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్. యం ఆదేశాల మేరకు బుడమేరు కాలువలో అడ్డుగా ఉన్న మొక్కలను తొలగించారు మలేరియా సిబ్బంది. ఈ సందర్భంగా బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు మాట్లాడుతూ, నీరు నిల్వ ఉంటేనే దోమలు వచ్చే అవకాశాలుంటాయి, అందుకోసమే నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు నీటి ప్రవాహం ఉండేటట్టు అడ్డొచ్చిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్కలు తొలగిస్తున్నామని అన్నారు. బుడమేరు కాలువ గట్ల వద్ద అక్కడక్కడ గుంతలలో ఉన్న నీటి నిల్వల్లో దోమలు ఉత్పన్నమయ్యే అవకాశాలులోన, వాటిని నిర్మూలించేందుకు యాంటీ లార్వా ఆపరేషన్లలో భాగంగా తైవాన్ స్ప్రే చేశామని అన్నారు.

# రాయిని వజ్రంలా మార్చగలిగే ఏకైక వ్యక్తి గురువు









**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించి, గురువుల ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మహాలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి విద్యమూల హేతువు, జ్ఞానానికి వారధి అని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.

తమస్సు తొలగించి జీవితానికి ఉషస్సు తెచ్చి, శాశ్వతమైన తేజస్సును అందిచేది విద్య అని, జ్ఞాన శక్తితో ఉదాత్త మైన యుక్తితో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారి అభ్యున్నతిని ఆకాంక్షించి దివ్య చైతన్య స్ఫూర్తి గురువూ శృద్ధాసక్తులతో, భక్తి విశ్వాసాలతో గురువు నుంచి జ్ఞానాన్ని అందుకునే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. జీవానానికి ఉపకరించే సమస్త విజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని మార్గదర్శకత్వాన్ని, విద్యార్థుల బావి జీవితాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడం, సమయానుకూలంగా హితోపదేశం చేసే అభ్యుదయ మార్గదర్శి, గురువులకే స్ఫూర్తి ప్రధాత, చిరస్మరనీయుడు చిరయశస్సు అందుకున్న డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణ దినోత్సవంగా దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు వేషధారణలు ధరించి నృత్య, నాటక ప్రదర్శనలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఈజియం యం.మురళి కృష్ణ, ఆర్ఐజె రాజేష్ బాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ సిహెచ్.సురేష్, ఇన్చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొని అందరికి 'టీచర్స్ డే' శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎలాంటి ఇబ్బంది కలగకుండా యూరియా సక్రమంగా సరఫరా అవ్వాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యూరియా సక్రమంగా సకాలంలో సంబంధిత రిటైల్డ్ డీలర్లకు సరఫరా అయ్యేలా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు హోల్సేల్ డీలర్లకు సూచించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి వ్యవసాయ అధికారులు, హోల్సేల్ డీలర్లు, రవాణాదారులతో యూరియా సరఫరా పై సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో బుధవారం జరిగిన సంఘటన పునరావృతం కాకుండా అందరూ జాగ్రత్త వహించాలన్నారు. యూరియా రవాణాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రైతులు బారులు తీరకుండా ఎక్కడికి అక్కడ ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలన్నారు. మండలాల్లో ఎక్కడ యూరియా అవసరం ఉందో ముందుగా అక్కడి రీటైల్ డీలర్లకు అందజేయాలన్నారు. ఒక డోసు కూడా ఇవ్వని గ్రామాలకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియాతోపాటు పొటాషియం ఇతర ఎరువులను కలుపుకోకుండా కేవలం యూరియా బస్తాలను మాత్రమే హోల్ సేల్ డీలర్లు అందరూ ఒక వాహనంలో తీసుకొని రిటైల్ డీలర్లకు సరఫరా చేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతులకు యూరియా బస్తాలు అమ్మినప్పుడే ఎప్పటికప్పుడు వారి నుండి బయోమెట్రిక్ తీసుకొని వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. కంపెనీల నుండి సరఫరా అవుతున్న యూరియా ఆలస్యం లేకుండా త్వరగా సరఫరా అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, డిడి మనోహర్రావు, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, ఆర్టీవో మురళీధర్, డిసి ఓ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ ఏడీ మణిధర్, సబ్ డివిజనల్ ఏ డి లు సునీల్, జయప్రద శ్యామల కవిత స్వర్ణలత రమాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.



# వర్షపు నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వర్షపు నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం: సమీప కాలువలోకి ప్రవాహ మార్గం చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా పినమనేని పాలీ క్లినిక్ రోడ్, బెంజ్ సర్కిల్ నుండి రామవరప్పాడు నేషనల్ హై సర్వీస్ రోడ్, మాచవరం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షం కురిసినప్పుడల్లా పిన్నమనేని పోలి క్లినిక్ రోడ్, జమ్మి చెట్టు సెంటర్, పరిసర ప్రాంతాలలో వర్షపునీటి నిల్వలు నిలవడానికి గల కారణాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి గల కారణాలు, వాటిని అధిగమిస్తూ శాశ్వత పరిష్కారానికి ప్రణాళికను సిద్ధం చేయమని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించగా, బెంజ్ సర్కిల్ హైవే సర్వీస్ రోడ్ వద్ద ఉన్న డ్రైన్ ను పెంచాలన్న ప్రణాళిక కమిషనర్ ధ్యానచంద్ర ముందుకు అధికారులు తీసుకురాగా, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు నుండి పుల్లేటి కాలువ వరకు రెండున్నర కిలోమీటర్లు ఒక డ్రైన్ ప్రవహించే అవసరం ఎందుకు వస్తుందని, సమీపంలో ఉన్న బందర్ కాలువలోకి వాటిని మళ్లించేందుకు చర్యలు తీసుకునేటట్టు ప్రణాళికను సిద్ధం చేసి కార్యచరణను మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు, మరోవైపు పుల్లేటి కాలువ విస్తరణకు చర్యలు తీసుకొనడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం ఉంటుందని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఏలూరు రోడ్ లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో ప్రవహించేందుకు శాశ్వత పరిష్కారం లో భాగంగా మాచవరం, స్మశానం వద్ద ఉన్న డ్రైన్ ను పరిశీలించారు. ఆ డ్రైన్ ను విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి అన్నదానాలు ప్రారంభించిన గద్దె క్రాంతి కుమార్



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** గురువారం ఉదయం 6వ డివిజన్ పరిధిలోని బి.ఎన్.ఆర్ నగర్ 1వ రోడ్డులో, మొగల్ రాజపురం రావి చెట్టు సెంటర్ వద్ద గల వినాయక చవితి ఉత్సవ కార్యక్రమమాలో టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రెండు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ విజయవాడలోనే కాకుండా రాష్ట్ర మొత్తం మీద కూడా వినాయకుడు చవితి వేడుకలు అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు కావడంతో పాటు ప్రజల జీవన విధానంలో కూడా చక్కని మార్పులు వచ్చాయని దాని ఫలితంగానే వినాయక చవితి ఉత్సవాలు కూడా స్నేహపూరిత వాతావరణంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమాల్లో పడాల గంగాధర్, నాగవంశీ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణ, అప్పరబోతు రాము, అప్పరబోతు పైడి నాయుడు, దుక్కా సూర్య కిరణ్, కోయ్యాన భాస్కర్ పడాల పండు, మేడబలిమి భార్గవ్, మొకర గురునాథం, నూతక్కి బ్రహ్మం, కందుబోతి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో భాగస్వాములు కావటం గర్వకారణం

### ఎల్ఎసి అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఎల్ఐసి ఏజెంట్లు భాగస్వాములు కావటం గర్వకారణమని ఎల్ఐసి అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ అన్నారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఎఐసి) ఒకే రోజు దేశవ్యాప్తంగా 5.88లక్షల 107 పాలసీలు విక్రయించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించింది. ఈ మహాయజ్ఞంలో అవనిగడ్డ ఎస్ఐసి బ్రాంచ్ నుంచీ 211 మంది ఏజెంట్లు 339 పాలసీలు చేశారు. గిన్నీస్ బుక్ రికార్డులో భాగస్వాములైన ఏజెంట్లకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఏజెంటు పేరు, వివరాలతో కూడిన సర్టిఫికెట్లను గురువారం అవనిగడ్డ ఎల్ఎసి బ్రాంచ్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎల్ఎసి సీఈవో, ఎండి సిద్ధార్థ మహంతి సంతకం, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోగోతో కూడిన సర్టిఫికెట్ ఏజెంట్లకు గర్వకారణంగా నిలుస్తుందని బీఎం హరిప్రసాద్ అన్నారు. దేశవ్యాప్తంగా ఒకేరోజు 5.88 లక్షల 107 పాలసీలతో ఎస్ఐసి తన ప్రతిష్టను మరింతగా ద్విగుణీకృతం చేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఏజెంటుకూ ఆయన శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ బీఎం రామయ్య, డెవలప్మెంట్ ఆఫీసర్లు, కార్యాలయ అధికారులు, క్లియా, లికా, ఎజెంట్లు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ, నందిగామ రూరల్, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999